ప్రజాశక్తి

సోమవారం 31 జూలై 2023

హాస్టల్ సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో 15వ డివిజన్‌లో ఉన్న బిసి హాస్టల్‌ను తెలుగు యువత సభ్యులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్లో కనీస సౌకర్యాలు లేవని, చాలీచాలని స్థలంలో నిద్రపోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుగు యువత నాయకులు తెలిపారు. వెంటనే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించి, సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేకుంటే సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం సాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జి.సురేంద్ర యాదవ్, నాయకులు పి.పైడిరాజు, మద్దెల ప్రవీణ్, గంటా రవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకై పోరుయాత్ర

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి ● జాతాకు ఘన స్వాగతం

బొబ్బిలి సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి

మహిళల రక్షణ కోసం పోరుయాత్ర చేపట్టినట్లు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి తెలిపారు. ఐద్వా ఆధ్వర్యాన చేపట్టిన హింసపై మహిళల పోరుయాత్ర జిల్లాలో ఆదివారం ప్రవేశించింది. బొబ్బిలి, గజపతినగరం మీదుగా విజయనగరం చేరుకుంది. యాత్రకు ఎక్కడికక్కడ సిఐటియు, యుటిఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, శ్రామిక మహిళా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభల్లో ప్రభావతి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై హింస రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో మహిళలను నడిరోడ్డుపై నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేయడం భరతమాతను అవమానించడం కాదా? అని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవడంలో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి మహిళలపై చులకన భావన ఉందన్నారు. హింసను రెచ్చగొడుతున్న బిజెపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖలో వరలక్ష్మి హత్య, రేపల్లె రైల్వేస్టేషన్లో, విజయనగరంలో ఇద్దరు పిల్లల తల్లి ఇంటిలోనే గ్యాంగ్‌రేప్‌కు గురికావడం రాష్ట్రంలో నేరస్థితికి దర్పణం పడుతున్నాయని చెప్పారు. మద్యం, మత్తుమందులు ప్రధానంగా నేరాలు పెరగడానికి కారణమని అనేక సర్వేలు తెలుపుతున్నా.. వాటిని అరికట్టే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అరకు ఏజెన్సీ మత్తుమందుల వ్యాపారులకు అడ్డాగా మారిందని, వారికి ప్రభుత్వాలు అండగా ఉన్నాయని విమర్శించారు. ఎన్నికలకు ముందు మద్య నిషేధం చేస్తానని సిఎం జగన్ వాగ్దానం చేసినా అమలు కాలేదన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా మహిళల పోరుయాత్ర చేపడుతోందని తెలిపారు. ఆగస్టు 9న విజయవాడలో భారీ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పోరు యాత్రకు స్వాగతం పలికిన వారిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, నాయకులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, తిరుపతి నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ నాయకులు పావని, జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్‌ఐ నాయకులు హరీష్, సతీష్, బి.రమణ, త్రినాథ్, జెవివి సమతా మహిళా జిల్లా కన్వీనర్ జి.నిర్మల తదితరులున్నారు.

కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు వై.సత్యవతి, పి.పూర్ణ, రమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కె.పుణ్యవతి, పి.రమణమ్మ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

విజనగరంలో పోరుయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

జాతాలో భాగంగా ప్రజానాట్య మండలి కళాకారులు మద్యం మత్తు వల్ల ప్రజలు, మహిళల జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతున్నాయో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఎల్‌బిజి నగర్ కళాకారుల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

ఎల్‌బిజి నగర్ కళాకారుల కోలాట ప్రదర్శన

అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

న్యాయస్థానాల ఏర్పాటుతో

సత్వర న్యాయం

అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన న్యాయస్థానాల ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందాలని హైకోర్టు న్యాయమూర్తులు అభిలషించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఐదుగురు హైకోర్టు న్యాయమూర్తులు జిల్లా కోర్టు సముదాయంలో కొత్తగా మంజూరైన అదనపు సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాన్ని ఆదివారం ప్రారంభించారు. హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి కె.శ్రీనివాసరెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు ఆకుల వెంకట శేషసాయి, చీకటి మానవేంద్రనాథ్ రాయ్, ఉపమాక దుర్గాప్రసాద రావు, దుప్పల వెంకటరమణ కలిసి ప్రారంభించారు. న్యాయసేవా సదన్‌లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని జస్టిస్ ఎ.వి.శేషసాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎ.వి.శేషసాయి మాట్లాడుతూ మంచి, నాణ్యమైన వాదనలు వినిపించే న్యాయవాదులు ఉన్నపుడే నాణ్యమైన తీర్పులు కూడా వస్తాయన్నారు. జాతిని జాగృతి చేసి మార్గనిర్దేశం చేసిన మహాకవి గురజాడ వంటి కవిని అందించిన ఈ నేల ఎంతో ధన్యమైనదని పేర్కొన్నారు. జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ కోర్టులన్నీ బ్రిటిష్ కాలం నాటి భవనాల్లోనే ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని కోర్టులో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో జిల్లా కలెక్టర్ కోర్టు యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు యువ న్యాయవాదులు ప్రయత్నించాలని జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో కోర్టు భవనాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. సాలూరు, పార్వతీపురం న్యాయస్థానాలు మినహా ఇతర కోర్టు భవనాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కొత్త భవనాలు మంజూరు చేయించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. అనంతరం న్యాయమూర్తి డి.వెంకటరమణ మాట్లాడారు. జిల్లాలో కోర్టులకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చడంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. జిల్లాకు రూ.99 కోట్లతో కొత్త కోర్టు భవనాలు మంజూరు కావడం సంతోషకరమన్నారు. జిల్లాలో కేసుల పరిష్కారంలో న్యాయవ్యవస్థ నుంచి పోలీసులకు పూర్తి సహకారం ఉందని ఎస్‌పి ఎం.దీపిక చెప్పారు. జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణచక్రవర్తి, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ రామ్మోహన్, కె.వి.ఎన్.తమ్మన్నశెట్టి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

10 నుంచి విద్యుత్తు ఉద్యోగుల సమ్మె

విజయవంతం చేయాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆగస్టు పదో తేది నుంచి చేపట్టే విద్యుత్తు ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎపి విద్యుత్తు ట్రేడ్ యూనియన్స్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి జి.అప్పలసూరి అధ్యక్షత వహించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగుల పిఆర్‌సి కాలపరిమితి గతేడాది మార్చి 31తో ముగిసిందన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి కొత్త పిఆర్‌సి అమలు కావాల్సి ఉన్నా నేటికీ అమలు చేయలేదన్నారు. దీనిపై విద్యుత్తు ఉద్యోగ సంఘాలు.. విద్యుత్తు యాజమాన్యాలకు, రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వం న్మో వా న్ సింగ్‌తో ఏకసభ్య కమిటీ వేసి 90 రోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలని గడువు నిర్దేశించిందని, ఏకసభ్య కమిటీ [illegible] సకాలంలో ప్రభుత్వానికి నివేదించిందని తెలిపారు. 16 నెలలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది తప్ప ఉద్యోగులకు పిఆర్‌సి ఇచ్చే దిశగా ఆలోచించడం లేదన్నారు. ఈకాలంలో అనేక రూపాల్లో ఉద్యోగాలు పోరాటాలు చేశారన్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఆగస్టు పదో తేది నుంచి సమ్మె చేస్తామని విద్యుత్తు సంస్థలకు, ప్రభుత్వానికి నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. విద్యుత్తు ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలన్నారు. విద్యుత్తు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జెఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొహిబిషన్ డిక్లేర్ చెయ్యాలన్నారు. ఇపిఎఫ్ అమలవుతున్న విద్యుత్తు ఉద్యోగులందరికీ జిపిఎఫ్‌లోకి మార్చాలన్నారు. కారుణ్య నియామకాల్లో అడ్డగోలు నిబంధనలు పెట్టవద్దని కోరారు. డిఎ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్తు రంగాన్ని కేంద్రం తన ఆధీనంలోకి తీసుకోవడం కోసం విద్యుత్తు చట్ట సవరణ చేయాలని చూస్తోందన్నారు. దీనివల్ల రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతింటాయని చెప్పారు. ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్తు ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వివిధ సంఘాలు, అసోసియేషన్లు మద్దతు ఇవ్వాలని కోరారు.

అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజనల్ సెక్రటరీ వి.రాములు, మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, సిఐటియు విజయనగరం, పార్వతీపురం జిల్లాల ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, వై.మన్మథరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డి.వి రమణ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ వి.ఇందిర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్ మాట్లాడారు.

టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సారిపల్లిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పట్టాలను పంపిణీ చేశారు. ఆదివారం టిడ్కో గృహ సముదాయం వద్ద మొత్తం 480 మంది లబ్ధిదారులకు గృహ పత్రాలు, ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఓట్ల కోసమే టిడ్కో ఇళ్ల వద్ద గృహప్రవేశాలు చేయించిందని ఆరోపించారు. అధిక శాతం పనులు చేపట్టకపోవడంతో లబ్ధిదారులు టిడ్కో ఇళ్లవైపు కన్నెత్తి చూడలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్మోహన్ రెడ్డి.. టిడ్కో వ్యవహారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాక లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్నట్లు తెలిపారు. 2656 ఇళ్లు సిద్ధంగా ఉన్నాయని, లబ్ధిదారులు త్వరగా నిర్మించిన ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు 72,480 గృహాలను లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి 10 లక్షల రూపాయల వరకు ఆస్తిని సిఎం జగన్ ఇళ్ల రూపంలో అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, టిడ్కో ఎస్ఇ డి.నరసింహమూర్తి, ఇఇ జ్యోతి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు తవిటిరాజు, గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, జమ్మాన ప్రసన్నకుమార్

రౌండ్ టేబుల్ సమావేశంలో జెవివి సమతా మహిళా విభాగం జిల్లా కన్వీనర్ నిర్మల

మణిపూర్‌లో మారణ హోమం ఆపాలి

జెవివి సమతా మహిళా విభాగం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మణిపూర్‌లో మారణ హోమం ఆపాలని, మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వక్తలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక సమతా మహిళా విభాగం ఆధ్వర్యాన ఆదివారం స్థానిక జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమతా మహిళా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల అధ్యక్షత వహించారు. అధ్యక్షులు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమావేశంలో పాల్గొన్న వక్తలు ఆమోదించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా మారణ హోమం సాగుతోందని, దాదాపు వంద మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన దుర్ఘటన అమానవీయం, అమానుషమని ఖండించారు. ఇంత అరాచకం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రధాని మోడీ సకాలంలో స్పందించి ఉన్మాద చర్యలను అదుపు చేయలేకపోవడమే అక్కడి ఘర్షణలకు కారణమన్నారు దీనికి కార్పొరేట్ల, మతోన్మాదుల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే అసలు కారణమని స్పష్టమవుతోందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని మంటగలిపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేసే ఇటువంటి అరాచక శక్తుల ఆగడాలను కేంద్ర ప్రభుత్వం అరికట్టలేకపోవడం అభ్యంతరకరమన్నారు. మహిళలపై జరిగిన అమానుష దాడుల వ్యవహారం దాదాపు రెండు నెలల తరువాత గానీ బయట ప్రపంచానికి తెలియనీక పోవడం, తెలిసిన తరువాత కూడా దోషుల్ని శిక్షించడానికి చొరవ చూపకపోవడం సభ్య సమాజాన్ని నివ్వెరపరిచిందన్నారు. వెంటనే ఉన్మాదులను కఠినంగా శిక్షించి, బాధితులకు రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస, జెవివి నాయకులు వి.రాజగోపాల్, సాహితీ స్రవంతి నాయకులు చీకటి దివాకర్, ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యులు పావని, సమతా మహిళా విభాగం సభ్యులు బాయి రమణమ్మ, ఐద్వా నాయకులు కరుణ, మహిళా సమాఖ్య సభ్యులు బి.పావని, రచయిత్రి ఎన్.చిన్నాదేవి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, మెడికల్ రేప్స్ యూనియన్ నాయకులు శశిధర్, డివైఎఫ్‌ఐ నాయకులు సతీష్, ముస్లిం మైనారిటీ నాయకులు హఫీజ్, శాబ్బ, నజ్మ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు గంగా ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు సిద్ధం

- ఆర్‌బికెల్లో సబ్సిడీపై విరివిరిగా పొందొచ్చు
- ఆశాజనకంగా ఖరీఫ్ పంటలు
- ప్రారంభమైన ఉబాలు
- ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.టి.రామారావు ముఖాముఖి

జిల్లాలో వ్యవసాయ పంటలకు అవసరమైన ఎరువులన్నీ సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు తెలిపారు. వీటిని సబ్సిడీపై స్థానిక ఆర్‌బికెల్లోనే విరివిరిగా పొందవచ్చని చెప్పారు. ప్రయివేటు మార్కెట్‌లోనూ, పిఎసిఎస్‌లలోనూ అందుబాటులో ఉంటాయని వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాలు, చెరువులు నిండాయన్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో ఉబాలు పూర్తవుతాయని, పంటలన్నీ ఆశాజనకంగానే సాగవుతాయని భావిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయని చెప్పారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

మన జిల్లాలో వరి ఏయే రకాలు సాగవుతున్నాయి?.

జిల్లా భూసారం, నీటి లభ్యతను బట్టి ఈ ఏడాది ఏడు రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉంచాం. దాదాపు అన్నింటినీ రైతులు వినియోగించారు. ఇందులో అత్యధికంగా సోనామసూరి (బిపిటి 3291), ఆ తరువాత స్థానంలో సాంబమసూరి (బిపిటి 5204), అమర (ఎంటియు 1064) ఉన్నాయి. సూపర్ ఫైమ్ కొత్తరకం వెరైటీ (ఎంటియు 1318) కూడా అక్కడక్కడ నాట్లు పడనున్నాయి.

ఖరీఫ్ సీజన్ ఎలా ఉండబోతోంది?.

ఈ ఏడాది ఖరీఫ్ పంటలు ఆశాజనకంగానే ఉంటాయని భావిస్తున్నాం. ఇప్పటికే అధిక వర్షపాతం నమోదు కావడంతో ఈ ఏడాది సకాలంలో ఉబాలు పడనున్నాయి. వారం క్రితమే నారుపోత పూర్తయింది. దీన్నిబట్టి మిగిలిన పంటల సాగుకు కూడా ఢోకా ఉండదనిపిస్తోంది.

జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఎంత?

గత ఖరీఫ్‌లో 2,90,476 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 3,13,465 ఎకరాల్లో సాగుకావచ్చని అంచనా. ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం అత్యధికంగా 2,34,112 ఎకరాల్లో వరిసాగు కానుంది. జిల్లాలో అత్యంత ప్రధాన పంట వరి. మొక్కజొన్న 31,375 ఎకరాలు, నువ్వులు 18,305 ఎకరాలు, చెరకు 11,525 ఎకరాలు, పత్తి 5,105 ఎకరాలు, వేరుశనగ 868 ఎకరాలు, రాగులు 96 ఎకరాలు, మినుములు, పెసలు, కందులు తదితర అపరాలు 329 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. అందుకనుగణంగానే ఎరువులు సిద్ధంగా ఉంచాం.



ఎరువులన్నీ సిద్ధంగా ఉన్నాయా?.

ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని ఏడాదికి 82,641 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నట్టు గుర్తించాం. ఇందులో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47,787 మెట్రిక్ టన్నులు అవసరం కానుంది. ఇందులో 23,079 మెట్రిక్ టన్నుల మేర బఫర్ స్టాక్ ఉంది. ఈ సీజన్‌లో మొత్తంగా అవసరమైన ఎరువుల్లో సుమారు 18,359 మెట్రిక్ టన్నుల వరకు ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉంది.

ప్రస్తుత సీజన్‌లో రకాల వారిగా ఎరువులు ఎంతెంత అవసరం?.

యూరియా 25,301 మెట్రిక్ టన్నులు, డిఎపి 10,478, ఎంఒపి 3088 మెట్రిక్ టన్నులు, ఎస్‌ఎస్‌పి 1412 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 7,508 మెట్రిక్ టన్నుల చొప్పున జిల్లాకు అవసరం.

ఎరువుల పంపిణీ విధానం ఎలా ఉంటుంది?.

విత్తనాల మాదిరిగానే ఎరువులు కూడా ఆర్‌బికెల్లో రైతులకు అందుబాటులో ఉంచాం. వరి విత్తనాలపై ప్రభుత్వం కిలోకు రూ.10 చొప్పున రాయితీ కల్పించింది. పచ్చిరొట్ట విత్తనాలు మాత్రం 50శాతం సబ్సిడీపై పొందవచ్చు. మిగిలిన పంటల విత్తనాలు ప్రయివేట్ మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాకు వస్తున్న ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, మిగతా సగం ప్రయివేటు మార్కెట్‌కు వెళ్తాయి. మార్క్‌ఫెడ్‌కు వచ్చిన ఎరువుల్లో 70 శాతం ఆర్‌బికెల ద్వారా, మిగిలిన 30 శాతం పిఎసిఎస్‌ల ద్వారా రైతులకు సరఫరా కానున్నాయి.

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న బేబినాయన

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న అదే పట్టణానికి చెందిన సవర దుర్గాప్రసాద్‌కి రెండు కిడ్నీలు పాడైపోయి ఆపరేషన్ కోసం రూ. 10లక్షలకు పైగా ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. పేద కుటుంబానికి చెందిన దుర్గాప్రసాద్ ఇంత ఖర్చు పెట్టలేని పరిస్థితిల్లో అతని స్నేహితులు ఫేస్‌బుక్, వాట్సప్ ప్రచార మాధ్యమాలు, పత్రికా ప్రకటనల ద్వారా దాతలను ఆర్థిక సహాయం అందించమని వేడుకున్నారు. ఈ విషయాన్ని బొబ్బిలి పట్టణం రావువారి వీధికి చెందిన 18వ వార్డు టిడిపి నాయకులు బొత్స అప్పారావు, కర్రోతు రాములప్పన్న టిడిపి బొబ్బిలి నియోజకవర్గం ఇంచార్జ్ బేబినాయన దృష్టికి తీసుకొనిరాగా సాలూరులో ఉన్న బాధితుడు దుర్గాప్రసాద్ స్నేహితులను పిలిచి వారి సమక్షంలో బాధితునికి బొబ్బిలి కోటలో ఆదివారం ఆర్థిక సహాయం అందించారు.

రోడ్డుపై ఏనుగుల హల్‌చల్

ప్రజాశక్తి - వంగర

గత కొద్ది రోజులుగా మండలంలో పంట పొలాలలో సంచరిస్తున్న గజరాజులు ప్రస్తుతం మడ్డువలస సమీపంలోని వంగర రాజాం ప్రధాన రహదారిలోకి వచ్చి ఒక్కొక్కటిగా హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాం దోళన చెందుతున్నారు. రాత్రివేళ రోడ్లు పైకి వచ్చి చాలా సేపు రోడ్డుపైనే ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి కూడా రోడ్డుపైకి వచ్చిన ఏనుగు చాలా సేపు అలాగే నిలబడి రోడ్డుకు అడ్డుగా ఉండిపోవడంతో ప్రయాణికులు నానా తంటాలు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ రేంజ్ అధికారి మణికంఠ ఘటనా స్థలానికి చేరుకుని గజరాజులు కదిలికలను పరిశీలించారు.

రోడ్డుపై అడ్డంగా నిలబడిన ఏనుగు

కొబ్బరికాయ కొడుతున్న మేయర్ విజయలక్ష్మి

నాలుగేళ్లలో నగరంలో సంపూర్ణ అభివృద్ధి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో గత 30 ఏళ్లలో చూడలేని అభివృద్ధిని.. ఈ నాలుగేళ్లలో చేసి చూపించామని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. ఆదివారం నగరంలోని 41వ డివిజన్ కంటోన్మెంట్ ప్రాంతంలో రూ.23 లక్షలతో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో ఆయన పర్యటించారు. మార్గంలో డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడం, అందులోనే కుళాయి పైపులైన్లు ఉండటంతో ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. అక్కడ కల్వర్టు నిర్మాణంతోపాటు.. పైపులైన్లు మార్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం రూ.23 లక్షలతో రోడ్లు, డ్రెయిన్ల పనులు చేపడుతున్నట్లు వివరించారు. నెల రోజుల్లో వీటిని పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, జోనల్ ఇన్‌ఛార్జి దుబే, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే సిపిఎస్‌ను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డి.ఈశ్వరరావు, సిహెచ్ వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎపిటిఎఫ్ (1938) కార్యాలయంలో ఈశ్వరరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. జిఒ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇఎల్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న కంగట వీధి జంక్షన్ వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద ఆదివారం బి న్యూ సెల్ పాయింట్ మేనేజర్ బోడపింటి రవికుమార్ తమ కుమార్తె హర్ష్య మొదటి పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. తమకు ఒక పూట ఆకలి తీర్చినందుకు పేదలు చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి మంచి కార్యక్రమం, నిర్వహించినందుకు తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

ఎంటిఎస్ జిల్లా కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

98సం. పరిమితకాల ఉపాధ్యాయ(ఎంటిఎస్) సంఘం ఎంపిక ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సలహాదారు బి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా పూడి శంకరరావు, ప్రధానకార్యదర్శిగా జివిడి దామోదరప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఆర్‌వి ప్రసాద్, తవిటినాయుడు, జాయింట్ సెక్రటరీగా ఎన్.కోటేశ్వరరావు, కోశాధికారిగా బి.రామచంద్రన్, అదనపు కోశాధికారిగా సిహెచ్ రవీంద్రతో పాటు, పలుమండలాలకు చెందిన 14మంది ఉపాధ్యాయులను కార్యవర్గ సభ్యులుగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి పిటిజి గిరిజన గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం కోరారు. వందలాది మంది విద్యార్థులున్నచోట మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపడినవి లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే తమ పిల్లలను చూసేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన తల్లిదండ్రులు వేచి ఉండడానికి విశ్రాంతి షెడ్లు లేకపోవడంతో ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ గేటు బయట నిరీక్షించాల్సి వస్తుందన్నారు. వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కళ్లు కలకలం

ప్రజాశక్తి - విజయనగరం

జిల్లాలో కళ్ల కలకలు కలవరపెడుతున్నాయి. ప్రతిరోజూ వందలాదిమంది కళ్ల కలకల బారిన పడుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, జన సమూహం ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే ప్రజలు ఈ వ్యాధిబారిన పడుతున్నారు. కళ్ల కలకల బాధితులు ఇటీవల కాలంలో ఎక్కువగా ఆస్పత్రులకు వస్తున్నట్లు కంటి వైద్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షాకాలం చివరి దశలో ఎండలు, వానల కారణంగా వైరస్ ఎక్కువగా వ్యాప్తి చెందుతున్న కారణంగా కళ్లకు కండ్ల కలకల వ్యాధి ఎక్కువగా వస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి కంటి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే తొందరగా నయం చేయవచ్చు. కళ్ల కలకల వల్ల ప్రమాదం లేకపోయినా అప్రమత్తంగా ఉండడం అవసరమని చెప్పారమని, సొంత వైద్యం కాకుండా కంటి వైద్యనిపుణుల సలహా మేరకు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

వేగంగా వ్యాప్తి...

ఇది ఒకరి నుండి ఒకరికి త్వరగా వ్యాపిస్తుంది. బాధితులు తమ కుటుంబ సభ్యులతో కలవకుండా కనీసం వారం రోజులపాటు ప్రత్యేకంగా ఒక గదిలో ఉండాలి. కళ్ల కలకసోకిన వ్యక్తి తాకిన వస్తువులను ఇతరులు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధిని కొంతవరకు నివారించొచ్చు. కళ్ల కలక సోకిన వారు తరచూ కళ్లను తాకాల్సి వస్తుంది. అలా తాకిన ప్రతిసారి చేతులు శుభ్రం చేసుకోవాలి.



కళ్ల కలకలతో ఆస్పత్రికి వచ్చిన రోగులు

జాగ్రత్తలు: కళ్ల కలకల బారిన పడినవారు కంటిని తాకకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. మెత్తటి గుడ్డతో కంటి భాగాన్ని ఒత్తిడి తగలకుండా తుడుచుకోవాలి. తరచూ శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. ఇంటి నుండి బయటకు రాకుండా గదిలోనే ఉండాలి. కుటుంబ సభ్యులకు సైతం దూరంగా ఉండాలి. వారం రోజుల్లోపు తగ్గకపోతే తప్పని సరిగా నేత్ర వైద్య నిపుణు లను సంప్రదించాలి. వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాలి. నవజాత శిశు వు కండ్ల కలక సోకితే ప్రమాదకరం. కండ్ల కలక బాధితులు చిన్నారులకు దూరంగా ఉండాలి. పాఠశాలలు, ప్రజలు ఎక్కువగా గుమ్మి కూడిన ప్రదేశాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

ఇవీ లక్షణాలు

కంటి నుంచి విపరీతంగా నీరు కారడం, కళ్లు ఎర్రబడడం, రెప్పలు అంటుకుపోవడం, విపరీతంగా పుసులురావడం, మంట పుట్టడం, కంటిలో ఇసుక పడినట్లు గుచ్చుకోవడం తదితర లక్షణాలుంటే నేత్ర వైద్యులు సంప్రదించాలి. గతంలో కరోనా బారిన పడిన వారిలో ఈ వ్యాధి సులభంగా వ్యాపించే అవ కాశం ఉంది. కంటి గుడ్డి చుట్టూ తెల్లని పొర రెప్పలా వెనుక ఉండే పొరను కంపెనైనా అంటారు. దుమ్ము, ధూళి, వేడి నీరు, అధిక గాలి కంటి పొరలను తాకితే శరీరంలో సున్నిత భాగమైన కన్ను తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది. సున్నితమైన అవయవాలు కావడంతో వేగంగా ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశం ఉంది. కళ్లు ఎర్రగా మారుతాయి. ఒక కంటికి కానీ కొందరికి రెండు కళ్లకి వచ్చే అవకాశం ఉంది. ఇన్ఫెక్షన్ కారణంగా కణజాలంలో చేరిన బాక్టీరియా వైరస్ ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంది.

ఓట్లు నమోదు చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

18ఏళ్లు నిండిన వారందరు ఓటు నమోదు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం పోలింగ్ బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైసిపి విజయానికి పని చేయాలన్నారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు పొందేలా చూడాల్సిన బాధ్యత బూత్ కన్వీనర్లపై ఉందన్నారు. ఓట్లు నమోదుపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు తూముల భాస్కరరావు, జెడ్‌పిటిసి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ఓటు వజ్రాయుధమని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఓటర్ల జాబితా దర్యాప్తుపై ఆదివారం సర్వే చేశారు. ఓటు వజ్రాయుధమని, 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటును నమోదు చేసుకుని ఓటుహక్కు పొందాలన్నారు. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. ఓటుహక్కుపై ఇంటింటికి వెళ్లి యువతకు అవగాహన కల్పించారు. ఓటర్ల దర్యాప్తు సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేయాలని బిఎల్‌ఓలను కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట చినప్పలనాయుడు

నాలుగేళ్లలో పదిమంది పిఆర్ జెఇలు

- ప్రతి సారీ మారడంతో కుంటుపడుతున్న అభివృద్ధి
- బిల్లుల కోసం పడిగాపులు

ప్రజాశక్తి- డెంకాడ

వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ల కాలంలో డెంకాడ మండలానికి పదిమంది పంచాయతీరాజ్ జెఇలు పని చేశారు. ఇక్కడ పని చేస్తున్న పంచాయతీరాజ్ జెఇలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు నచ్చకపోవడంతో పట్టుమని పది రోజులు కూడా ఇక్కడ పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మండలంలో ఉన్న గ్రామాలు అభివృద్ధికి నోచుకోక కుంటిపడుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుకొక పంచాయతీ రాజ్ జెఇ మారడంతో గ్రామాల్లో వర్కు గురించి ఎవరికి చెప్పాలి ఎవరి దగ్గరికి వెళ్లి ఎంబుక్ చేయించుకోవాలో అర్థంకాక శతమతమవుతున్నారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు అవ్వకపోవడంతో గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయారు. దీనికి తోడు జెఇలు తరచుగా మారడంతో మరీ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటివరకు ఇక్కడ సుమారు పదిమంది వరకు పనిచేశారు. వారిలో రెండో కరోనా తరువాత డెంకాడ జెఇగా పని చేసిన ప్రకాష్ రావు చనిపోయారు. ఆ తరువాత బివి సత్యనారాయణ, జె రమేష, ఎం సూర్యకుమారి, ఏ చంద్ర నాయుడు, బి గణేష, ఎం సుధాకర్ ఈ మండలంలో పనిచేశారు. ఇప్పుడు ఎం సుధాకర్ విశాఖ జిల్లా పద్మనాభ మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇతనైనా ఉంటాడో వెళ్లిపోతాడో తెలియక గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వచ్చిన పంచాయతీరాజ్ జెఇలను బదిలీ చేయకుండా గ్రామాల్లో చేసిన పనులకు త్వరితగతిన బిల్లు అయ్యేటట్లు చూడాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ వసతి గృహాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి నెల్లిమర్లలో మహాత్మా జ్యోతీ భా పూలే బిసి గురుకుల మత్స్యకార పాఠశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో హాస్టల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతి గదులను, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. అన్ని సబ్జెక్టులకు క్లాసులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ సురేష్ బాబు విలేకర్లతో మాట్లాడుతూ హాస్టల్లో గమనించిన కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కాగా ప్రభుత్వ వసతి గృహాలకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వ కల్పిస్తుందని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు.

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

కంప్యూటర్‌లో ఫండ్‌మెంటల్స్ చేస్తున్న విద్యార్థులు

'చదవడం మాకిష్టం'

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం విద్యార్థులతో ఉత్సాహంగా నిర్వహించామని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యా ర్థులు నీతి కథలు చదవడం, చెప్పడం జరిగిందని, విద్యార్థులు కంప్యూటర్స్‌లో ఫండమెంటల్స్ నేర్చుకు న్నారని ఆయన తెలిపారు.

గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక మిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గర్భిణులకు ఆదివారం రామతీర్థం గ్రామ అంగన్ వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. మిమ్స్ నర్సింగ్ కళశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థినులు గర్భిణుల ఆరోగ్యం, పోషకాహారం, జనన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. అనంతరం వారికి తనిఖీలు చేశారు.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనుమతుల్లేకుండా చెట్ల తొలగింపు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని విజయనగరం నాతవలస రహదారిలో పెదతాడివాడ సమీపంలో ఎటువంటి అనుమతులూ లేకుండా అర్‌అండ్‌బి రోడ్డు పక్కనే ఉన్న తాటి చెట్లను జెసిబితో తొలగిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని ప్రయివేటు రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన కొంత మంది లేఅవుట్ వేస్తున్నారు. ఇందులో భాగంగా వారికి అడ్డంగా ఉందన్న కారణంతో ఎటువంటి అనుమతులూ లేకుండా ఇష్టానుసారంగా రోడ్డు పక్కనే ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ప్రయాణికులకు నీడనిచ్చే చెట్లను తొగించడం పట్ల పలువురు పెదవి విరుస్తున్నారు. అర్‌అండ్‌బి, రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకుని చెట్లను తొలగించాల్సి ఉన్నా ఆ పరిస్థితి కనిపించలేదు. జెసిబిని పెట్టి భారీ వృక్షాలను తొలగిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇక్కడ ఉన్న చెట్లనే తొలగించారు..

రామతీర్థంలో హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సీతారామస్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవెంద్రనాథ్ రాయ్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణలు దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగ శాలలో నిర్వహించిన సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు న్యాయమూర్తులకు ఆశీర్వచనం అందించారు. కాగా రామతీర్థం పుణ్యక్షేత్రం చరిత్రను దేవస్థానం సహాయ కమిషనర్ బిహెచ్‌విఎస్‌ఎన్ కిషోర్ కుమార్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తుల వెంట జిల్లా జడ్జి బి సాయి కల్యాణ చక్రవర్తి, భోగాపురం సిఐ వెంకటేశ్వర్లు, నెల్లిమర్ల ఎస్ఐ నారాయణరావు తదితరులు ఉన్నారు.

హోమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

మద్యం సేవిస్తే కఠిన చర్యలు

బాడంగి: మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అటువంటి వారికి జైలు శిక్ష తప్పదని ఎస్ఐ ఆర్ జయంతి అన్నారు. శనివారం రాత్రి పూడివలస జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్, సరైన వాహనం పత్రాలు చూపించక పోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో భాగంగా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నామని వెల్లడించారు.

వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ జయంతి

క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని వాసు విద్యా సంస్థల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు అన్నారు. వాసు జూనియర్ కళాశాలలో 2021-23 విద్యా సంవత్సరంలో ఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను వారు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల విజయాలు వెనుక తల్లిదండ్రుల కష్టం ఉందన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాదించేందుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఎంత కష్టపడతారో తల్లిదండ్రులు కూడా అంతే కష్టపడతారని చెప్పారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. కళాశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధతో తమ పిల్లలు మంచి ఫలితాలు సాధించినట్లు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మణిపూర్‌లో ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - వంగర

మణిపూర్‌లో ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, అక్కడ ముఖ్యమంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని దళిత బహుజన జిల్లా జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ బాధితులకు మద్దతుగా మండల కేంద్రంలో దళిత బహుజన జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా నాయకులు మజ్జి గణపతి మాట్లాడుతూ మణిపూర్ మారణహోమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. ముఖ్యమంత్రిని తక్షణమే భర్తరఫ్ చెయ్యాలన్నారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకొనేల, మానవత్వం మంట గలిపేలా ఇటీవల కుకీ, ఆదివాసీ తెగలకు చెందిన ముగ్గురు గిరిజన స్త్రీలను బట్టలూడదీసి, నగ్నంగా వేలాది మంది మానవ మృగాల మధ్య వీధుల్లో ఊరేగించడం హేయమైన చర్య అని అన్నారు. మన రాష్ట్రంలో కూడా దళిత, ఆదివాసీల పై దాడులు జరుగుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సిర్ది రాజు, యలగాడ సింహాచలం, ఉదయ్‌రామ్, తిర్లింగి సింహాచలం, దాలిందొర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎసి నాయకులు

వృద్ధులకు సాధన యువజన సంఘం అన్నదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యులు వృద్ధులకు అన్న దానం చేశారు. ఆదివారం సాధన యువ జన సంఘం సభ్యులు తుమ్మ అశోక్ తనయుడు చేతన్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ నైట్ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులతో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సాధన యువ జన సంఘం అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్, నైట్ షెల్టర్ ఇంఛార్జి కె.రాజేష్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న సాధన యువజన సంఘం నాయకులు

వరి నారులో బీజామృతంపై అవగాహన కల్పిస్తున్న సుశీల

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరినాట్లు

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని గెడ్డపువలసలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరి లైన్ సోయింగ్ పద్ధతిలో వరి సాగు వేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తుమ్మగంటి సుశీల మాట్లాడుతూ వరస క్రమంలో వరి నాట్లు వేసుకోవడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి దుబ్బు బాగా చేస్తుందన్నారు. దోమపోటు కూడా రాకుండా ఉంటుందని రైతులకు తెలిపారు. అనంతరం రైతులు రౌతు సూర్యనారాయణ, గెడ్డపు ఆదినారాయణ పొలాల్లో వరి బీజామృతంతో నారు శుద్ధి చేసి లైన్ సోయింగ్ వేయించారు. వరిలో రాజీలేని పద్ధతులు ఉపయోగించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగు చేస్తే ఎటువంటి రసాయనాలూ వాడనవసరం లేదన్నారు. గట్లు చుట్టూ కంది, బంతి వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని చందన్ ఎసి లాడ్జిలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిందని ఇంచార్జ్ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న చందన్ ఏసి లాడ్జిలో ఈనెల 24న అరకు మండలం, ఉరుముల గ్రామానికి చెందిన మాదాల శ్రీరాములు అనే వ్యక్తి 103 నెంబర్ రూమును తీసుకుని ఏ రోజు రూమ్ రెంట్ ఆ రోజే చెల్లిస్తూ ఈ నెల 28 వరకు ఉన్నాడు. 28 తేదీ శుక్రవారం సినిమాకి వెళ్లి వస్తానని బాయ్‌తో చెప్పి వెళ్లి ఆదివారం వరకు లాడ్జికి రాలేదు. ఆదివారం రూమ్ నుండి దుర్వాసన వస్తుండడంతో లాడ్జి నిర్వాహకులు 100 కి డయల్ చేసి విషయాన్ని చెప్పారు. వెంటనే స్థానిక స్టేషన్ ఇంచార్జ్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ తారకేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లాడ్జి రూమ్ తెరిచి చూడగా ఓ మహిళ రక్తపు మడుగులో మృతి చెంది ఉండటాన్ని గమనించారు. వెంటనే విజయనగరం క్లూస్ టీమ్‌ను రప్పించారు. డిఎస్‌పి ఆర్ గోవిందరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారని సిఐ తెలిపారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు, వివరాలు సేకరించారని త్వరలోనే నిందితుని పట్టుకొని అన్ని వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. మృతి చెందిన మహిళ ఎవరు అనేది తెలియాల్సి ఉందని, మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలింమని చెప్పారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలంలోని మామిడి వలసకు చెందిన కొండపల్లి సీతయ్య (30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తికి భార్యతో కొన్నాళ్ళగా వివాదాల జరుగుతున్నాయి. దీంతో ఆమె వేరే వ్యక్తితో వుంటుందని మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి పోలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.